ఓడిన అభ్యర్థి వేదికపై.. ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే నేలపై!

విపక్ష ఎమ్మెల్యేల హక్కులను కాలరాస్తున్న సర్కార్

మొదటిపేజీ తరువాయి...

హక్కులకు భంగం కలిగిస్తూ, ప్రజాస్వామిక స్ఫూర్తిని కాలరాస్తున్నదని దుయ్యబట్టారు. ప్రతి సందర్భంలో ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. తమ పదేండ్ల పాలనలో ఎప్పుడూ ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడలేదన్నారు.

కాంగ్రెస్ నాయకులే ప్రజాప్రతినిధులా?

ఎమ్మెల్యేలకు స్థానిక నియోజకవర్గంలో జరిగే ఏ పనికి సంబంధించైనా ప్రొటోకాల్ ఉంటుందని, కాంగ్రెస్ నాయకులు కావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అవమానించే విధంగా ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కల్యాణిలక్ష్మి చెక్కుల పంపిణీతోపాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు అందించాల్సిన చెక్కులను స్థానిక ఎమ్మెల్యేను కాదని కాంగ్రెస్ నాయకులే పంపిణీ చేస్తున్నారని ఉదహరించారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభ కార్యక్రమాలను ఎమ్మెల్యే లేకుండానే పూర్తి చేస్తున్నరని అభ్యంతరం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేని చోట పోటీ చేసి, ఓడిపోయిన అభ్యర్థి, లేదంటే అక్కడి కాంగ్రెస్ నాయకులే ఎమ్మెల్యేలు అన్నట్టుగా వ్యవహారం సాగుతున్నదని మండిపడ్డారు. హుజూరాబాద్, మహేశ్వరం, ఆసిఫాబాద్, జనగామ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న చాలా నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలకు యథేచ్ఛగా పాల్పడుతూ ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలపైనే ఎదురుదాడి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని పెద్దల బెదిరింపుల కారణంగా అధికారులు సైతం వాళ్లు చెప్పిన విధంగా చేసే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి అప్రజాస్వామిక సంఘటనలు ఎంత మాత్రం సరైనవి కావని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఏడు నెలలుగా ప్రొటోకాల్ ఉల్లంఘనలు వరుసగా జరుగుతున్నాయని, ఈ విషయాన్ని తమ పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్ దృష్టికి తేవాలనే ప్రయత్నం చేసినా అందుబాటులో లేరని పేర్కొన్నారు.

ప్రొటోకాల్‌ను పరిరక్షించాలి

ఎమ్మెల్యేల హక్కులను, వారికి ఉండే ప్రొటోకాల్‌ను పరిరక్షించే విషయంలో పూర్తి అధికారం స్పీకర్‌దేనని కేటీఆర్ గుర్తుచేశారు. ఎమ్మెల్యేల హక్కులు, ప్రొటోకాల్, వారి గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉన్నదని పేర్కొన్నారు. గత కొంతకాలంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విషయంలో ఏ విధంగా ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారో మీడియా ద్వారా కూడా వెలుగుచూసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్యేల హక్కుల రక్షణ విషయంలో స్పీకర్ తన అధికారాలను వినియోగించాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రొటోకాల్ పరిరక్షణ కోసం వెంటనే సీఎస్ సహా అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

మొదటిపేజీ తరువాయి...

శాసనసభకు ప్రాతినిధ్యం వహించడంతోపాటు మూడు పర్యాయాలు మంత్రిగా సుదీర్ఘ రాజకీయానుభవం ఉన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ సర్కారు తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే అధికారిక స్టేజీ ముందు నేలపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా? అని మండిపడ్డారు.

కొత్తపేట పరిధిలోని ఆర్కేపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయ ఆవరణలో ఆషాడ మాస బోనాల దశాబ్ది ఉత్సవాల-2024 చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాల్‌రావు హాజరయ్యారు. అధికారులు వారిని స్టేజీ మీదకు ఆహ్వానిస్తూనే, కార్యక్రమంతో ఏమాత్రం సంబంధంలేని, ప్రధానంగా ప్రజాప్రతినిధి కాని కాంగ్రెస్ నాయకుడు కే లక్ష్మారెడ్డిని స్టేజీ మీదకు ఆహ్వానించారు. దీనిపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమాల్లో సంబంధం లేని వ్యక్తిని ఎలా స్టేజీ మీదకు ఆహ్వానిస్తారు? అని ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాల్‌రావుతో పాటు అధికారులను ప్రశ్నించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు స్టేజీ మీదకు రావడంతో తోపులాట జరిగింది. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. అనంతరం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్టేజీ మీద నుంచి కిందకు వచ్చి నేలపై బైఠాయించి తన నిరసన వ్యక్తం చేశారు. ఎప్పుడూ లేనివిధంగా లబ్ధిదారులను మాత్రమే లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు పదిహేను నిమిషాల పాటు అక్కడ నిరసన వ్యక్తం చేసిన ఆమె.. ఆ తర్వాత దేవాలయం బయటికి వచ్చి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మళ్లీ బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు.

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ ఖిలా మైసమ్మ దేవాలయంలో బోనాల పండుగ చెక్కుల పంపిణీ సందర్భంగా ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీస్తున్న మాజీ మంత్రి సబిత. జోక్యం చేసుకుని సర్ది చెప్తున్న పోలీసులు

మాజీ ఎమ్మెల్యేలను ఆహ్వానించే చట్టం తీసుకురండి : ఎమ్మెల్యే సబితారెడ్డి

ఈ వివాదం నేపథ్యంలో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య చేసిన వ్యాఖ్యలకు సబితారెడ్డి ధీటుగా సమాధానమిచ్చారు. 'కేఎల్‌ఆర్ మాజీ ఎమ్మెల్యేనే కదా మేడం' అనడంతో ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఇక్కడ (మహేశ్వరం)మాజీ ఎమ్మెల్యే కాదు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే వేరే ఉన్నారు. అధికారిక కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యేలను పిలవడమనే చట్టం ఏమైనా ఉందా? రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలను పిలవండి. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ నుంచే ఆ సంప్రదాయాన్ని ప్రారంభించండి. కొడంగల్‌లో కూడా మాజీ ఎమ్మెల్యే ఉన్నారు. అధికారిక కార్యక్రమాలకు ఆయనను పిలవండి. ప్రొటోకాల్ అంశంలో మీరు (పోలీసులు) ఎందుకు మాట్లాడుతున్నారు? అంటూ మండిపడ్డారు. దీంతో ఏసీపీ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్ స్పందించాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను ప్రభుత్వం అవమానిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. సోమవారం మహేశ్వరంలో జరిగిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడుసార్లు మంత్రి, ఐదుసార్లు ఎమ్మెల్యే అయిన మహిళా ప్రజాప్రతినిధికి ఇందిరమ్మరాజ్యంలో గౌరవం లేదా? ప్రజలు గెలిపించిన నాయకులకు విలువ లేదా? అని ప్రశ్నించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని విస్మరించి, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి మూడో స్థానానికి పరిమితమైన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి అధికార యంత్రాంగం సలాం కొట్టడం ఏమిటని మండిపడ్డారు. ప్రొటోకాల్ విషయంలో ప్రజాప్రతినిధులకు జరుగుతున్న అవమానం పట్ల స్పీకర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ రద్దుకు సుప్రీంకోర్టులో కేసీఆర్ పిటిషన్

విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఛత్తీస్‌గఢ్ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్తుతోపాటు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం తదితర అంశాలపై విచారణకు నియమించిన జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ కమిషన్ తనకు నోటీసులు జారీచేసి, విచారణకు పిలవడంపై కేసీఆర్ న్యాయపోరాటం చేస్తున్నారు. దీంతో కేసీఆర్ పిటిషన్‌పై విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ప్రకటించింది.

కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలి

- 'కల్యాణలక్ష్మి'తో పాటు తులం బంగారం ఇవ్వాల్సిందే
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, జూలై 15: కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద రూ.లక్ష చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో 136 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వేముల పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచేందుకు రేవంత్‌రెడ్డి బంగారం ఇస్తామని చెప్పారని, నెలలు గడిచిపోతున్నా ఇంకా ఇవ్వడం లేదన్నారు. వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గౌడల హామీలపై స్పందనేది?

- ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహమేది?
- గౌడలకు ఇస్తామన్న మోపెడ్లు ఎక్కడ?
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): కల్లు గీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై సీఎం రేవంత్‌రెడ్డి నిరాశపర్చారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. గౌడ కులస్థులకు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఎన్నో హామీలు ఇచ్చారని, వాటి గురించి మాట్లాడుతారనుకుంటే.. స్పందించనేలేదని అన్నారు. సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ ఇచ్చిన కాటమయ్య మోకులు కేసీఆర్ హయంలో తయారైనవేనని, ఎన్నికల కోడ్ వల్ల ఇవ్వలేకపోయామని తెలిపారు. వైన్, బార్‌షాపుల్లో గౌడలకు కేసీఆర్ హయంలో 15 శాతం రిజర్వేషన్లు ఇస్తే, తాము 25 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిందని.. అలాంటిది షాపుల రిజర్వేషన్ల గురించి సీఎం ఎలాంటి ప్రకటన చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గీత కార్మికుల పెన్షన్ రూ.4 వేలకు పెంచాలని, ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి చనిపోతే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. గౌడలకు మోపెడ్‌లు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. సర్వాయి పాపన్న జయంతి వచ్చే నెలలోనే ఉన్నదని, అప్పటికి విగ్రహం ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెడతామన్నారని, ఇప్పటి వరకు ఆ ఊసే లేదని దుయ్యబట్టారు. సర్వాయి పాపన్న తిరిగిన 4 వేల ఎకరాల గుట్టలను పరిరక్షించేందుకు పురావస్తు శాఖకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నిర్మాణాలు జరుపుకుంటున్న నీరా కేఫ్‌ల మిగతా పనులు పూర్తి చేసి ప్రారంభించాలని, కల్లు దుకాణాలకు శాశ్వత లైసెన్సులు ఇస్తామన్న హామీ నెరవేర్చాలని అన్నారు. హామీల అమలుపై స్పందించకుంటే గౌడ సంఘాలతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, కల్లు గీత ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నేత ఇస్లావత్ రామచంద్రునాయక్ పాల్గొన్నారు.

గౌడన్నల గుండెలపై తన్నిన రేవంత్

- చెట్టుపై నిలబెట్టి ఎకసెక్కాలా?
- కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గౌడన్నల ఆత్మగౌరవ గుండెలపై సీఎం రేవంత్‌రెడ్డి తన్ని తాను బీసీ విరోధినని మరోసారి స్పష్టంచేశారని స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ ఆరోపించారు. లష్కర్‌గూడ సభలో సీఎం వ్యవహారశైలి దారుణమని ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. గౌడన్నను చెట్టుపై చాలాసేపు నిలబెట్టి, కింద కుర్చీపై కాలుమీద కాలేసుకొని కూర్చొని వృత్తిని ఎగతాళి చేస్తూ, సహచర మంత్రులతో ఎకసెక్కాలాడుతూ సీఎం రేవంత్ తన దొరతనాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం కేరళ వంటి రాష్ట్రాలకు ప్రతినిధి బృందం పంపి, అధ్యయనం చేయించి, బడ్జెట్ కేటాయించి రూపొందించిన కాటమయ్య రక్షణ కవచం కిట్‌లను తన ప్రభుత్వ పథకంగా సీఎం రేవంత్ ప్రగల్భాలు పలుకడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. బడుగులపై వైఖరి మారకపోతే, ముఖ్యమంత్రికి ముందున్నది ముసళ్ల పండుగ అని ఆంజనేయగౌడ్ హెచ్చరించారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద. చిత్రంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

స్థానిక సంస్థల నిర్వీర్యానికే హైడ్రా

- మూడు ముక్కలుగా జీహెచ్‌ఎంసీ నిర్ణయానికి బీఆర్ఎస్ వ్యతిరేకం
- కాంగ్రెస్ పాలనలో పడిపోయిన హైదరాబాద్ బ్రాండ్
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న పంచాయతీలు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను కలిపి మూడు కార్పొరేషన్లుగా చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అనుభవరాహిత్యం, అవగాహన రాహిత్యం, అనాలోచిత నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ పడిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ అథారిటీ (హైడ్రా) పేరుతో ఔటర్ రింగ్ రోడ్డులోని అన్ని మున్సిపాలిటీలను, చెరువులను, భూములను, ఆస్తులను కాపాడుతామని రెండు రోజులుగా వస్తున్న వార్తలు స్థానిక సంస్థలకు వ్యతిరేకమని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలన్నీ స్థానిక సంస్థలను బలోపేతం చేయకపోగా, నిర్వీర్యం చేస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. జీహెచ్‌ఎంసీతోపాటు శివారు ప్రాంతాల్లోని ఏడు కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టు లేనందునే హైడ్రా పేరుతో స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులకు, ప్రజలకు భాగస్వామ్యం లేకుండా పెత్తనం చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని వివేకానంద స్పష్టంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ అయిన తర్వాత జోన్లు, సర్కిళ్లు పెంచి డిప్యూటీ కమిషనర్లకు అధికారాలు ఇచ్చి హైదరాబాద్ మహానగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఫలితంగానే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధించిందని వివరించారు. ఏడు నెలలుగా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని, హైదరాబాద్ బ్రాండ్ రోజురోజుకు దిగజారి పోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

పార్టీ మార్పు దుష్ప్రచారమే

కేసీఆర్ నాయకత్వంలో తనకు రాష్ట్రంలో అత్యధిక మెజార్టీ వచ్చిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. పార్టీ మార్పుపై తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీ మారిన కడియం శ్రీహరి అనర్హత అంశంపై పిటిషనర్‌గా తానేనని వివేకానంద గుర్తుచేశారు. రాజకీయాల్లో హత్యలుండవని, ఆత్మహత్యలే ఉంటాయని, రేవంత్‌రెడ్డి ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నారని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్టు ఇస్తారో ఇయ్యరో అనే అనుమానం ఉందని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలందరూ త్వరలో అనర్హతకు గురవుతారని స్పష్టం చేశారు. ఉపఎన్నికలు వస్తాయని, బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు.

కొత్త జీపీల నియామకాలు తుది తీర్పునకు లోబడే

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని దిగువ కోర్టుల్లో కొత్త న్యాయాధికారుల నియామకాలు తమ తుది తీర్పునకు లోబడి ఉండాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా సెషన్స్ కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా చేస్తున్న నాగారం అంజయ్య సహా పలువురు ప్రభుత్వ ప్లీడర్లు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ జరిపారు. ప్రస్తుతమున్న లా ఆఫీసర్ల స్థానంలో పనిచేయడానికి ప్రత్యామ్నాయ/తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించిందని, మూడేండ్ల కాలానికి నియమితులైన వారిని కాదని కొత్త ప్లీడర్లను నియమించడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ల తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్త న్యాయాధికారులను నియమించకుండా తాత్కాలిక స్టే ఇవ్వాలని కోరారు. దీనిపై కౌంటర్ దాఖలుకు గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు.

రాధాకిషన్‌రావు బెయిల్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

నాంపల్లి కోర్టులు, జూలై 15(నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన 17వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్.. కౌంటర్ దాఖలు నిమిత్తం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు నోటీసులు జారీ చేశారు. గడువు కావాలని పీపీ కోరడంతో విచారణ మంగళవారానికి వాయిదా పడింది.

పోలీసుల కస్టడీ పిటిషన్‌పై నేడు తీర్పు

కిడ్నాప్‌తోపాటు బెదిరింపు కేసులో జూబ్లీహిల్స్ పోలీసులు ప్రొడక్షన్ వారెంట్‌పై రాధాకిషన్‌రావును అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ నిమిత్తం రాధాకిషన్‌రావును 10 రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో తీర్పును మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది.

హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్ల జేఏసీ ప్రతినిధులు

పెన్షనర్ల పోరుబాట

- సీఎం మొండి వైఖరి వీడాలి
- మా సమస్యలు పరిష్కరించాలి
- మంత్రి, సీఎస్ చుట్టూ తిరిగినా పనులు కావడం లేదు
- పెండింగ్ డీఏల కోసం పెన్షనర్ల జేఏసీ నిరసన
- కలెక్టరేట్లలో ఆందోళన
- 30న ఇందిరాపార్కు వద్ద దీక్ష

హైదరాబాద్ సిటీబ్యూరో/జనగామ/కామారెడ్డి, జూలై 15 (నమస్తేతెలంగాణ): ప్రజాపాలన అంటూ సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకోవడమే గానీ ఎక్కడా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్‌కు దరఖాస్తులు సమర్పించినా ప్రయోజనంలేదని వాపోయారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం అన్నీ కలెక్టరేట్ల ఎదుట పెన్షనర్ల జేఏసీ సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళనచేపట్టారు. జనగామ, కామారెడ్డి కలెక్టరేట్లలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టీ శుభాకర్‌రావు మాట్లాడుతూ.. పెన్షనర్లకు బకాయి ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్‌ఎస్ స్కీంతో అన్ని కార్పొరేట్ దవాఖానల్లో నగదు రహిత చికిత్స వర్తింపజేయాలని చెప్పారు. ప్రతీ జిల్లాలో రెండు వెల్‌నెస్ సెంటర్లు, హైదరాబాద్‌లో 10 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి వైద్యులు, మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఐఆర్ 5 శాతాన్ని కనీసం 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రూ.398 నిర్ణీత వేతనంతో పనిచేసి రిటైర్డ్ అయిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో మాటిచ్చారని.. దాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. పెన్షన్‌దారులకు రాష్ట్రస్థాయిలో డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో ప్రభుత్వ పెన్షనర్లు క్రియాశీలకంగా పాల్గొన్నారని వారందరిని గుర్తించి ఇన్సెంటివ్ ఇచ్చి గౌరవించాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు 30న రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద 'మౌన దీక్ష' చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2 లక్షల మంది పెన్షనర్లు పాల్గొంటారని వివరించారు.

ఎమ్మెల్యేల ఫిరాయింపుపై విచారణ 18కి వాయిదా

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేలు దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), తెల్లం వెంకటరావు (భద్రాచలం) పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణ ఈ నెల 18కి వాయిదా పడింది. వారిపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేర్వేరుగా దాఖలు చేసిన ఈ పిటిషన్లపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ జరపాల్సి ఉన్నది. కానీ, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఈ విచారణ మరోసారి వాయిదా పడింది.

అర్చకుల బదిలీపై హైకోర్టు స్టే

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఆలయాల్లోని అర్చకుల బదిలీ ప్రక్రియను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల కోసం అప్లన్లను కోరుతూ దేవాదాయ శాఖ జారీ చేసిన ఆదేశాలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ పుల్లా కార్తీక్ సోమవారం విచారణ చేపట్టారు. అర్చకులను ఉద్యోగులుగా పరిగణించి బదిలీ చేయడం చెల్లదని, మతపరమైన కార్యకలాపాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సరికాదని పిటిషనర్ల తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో అర్చకుల బదిలీలపై కోర్టు స్టే విధించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని దేవదాయ శాఖను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

ఎమ్మెల్యే లేఖ ఆధారంగా చర్యలా?

బీఆర్ఎస్ కార్యాలయ నిర్మాణ కేసులో ఆర్డీవో తీరును తప్పుపట్టిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 15(నమస్తేతెలంగాణ): హనుమకొండలో బీఆర్ఎస్ కార్యాలయం ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాలంటూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి రాసిన లేఖ ఆధారంగా ఆర్డీవో చర్యలకు ఉపక్రమించడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఎమ్మెల్యే చెబితే ఏమైనా చేసేస్తారా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీసింది. ఈ వ్యవహారంలో కలెక్టర్‌కు రాజేందర్‌రెడ్డి రాసిన లేఖను సమర్పించాలని ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ కార్యాలయ నిర్మాణ అనుమతులతో పాటు స్థల కేటాయింపు ఉత్తర్వులను మూడు రోజుల్లోగా సమర్పించాలంటూ జూన్ 25న మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జారీచేసిన నోటీసుకు వ్యతిరేకంగా హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు వినయ్ భాస్కర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. 2018లో ప్రభుత్వం బీఆర్ఎస్‌కు ఎకరం స్థలాన్ని కేటాయించిందని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. అది ఉచితంగా జరిపిన కేటాయింపు కాదని, ఆ స్థలంకోసం ప్రభుత్వానికి బీఆర్ఎస్ రూ.4.84 లక్షలు చెల్లించిందని వివరించారు. ఇప్పటివరకు ప్రహరీ నిర్మాణం మాత్రమే జరిగిన ఆ స్థలం లో తాత్కాలికంగా షెడ్డును ఏర్పాటు చేసుకుని పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇంతలో అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి కల్పించుకుని.. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కాకుండా మరోచోట బీఆర్ఎస్ నిర్మాణాలు చేపట్టిందని, అనుమతులు లేకుండా ప్రహరీ నిర్మించిందని తెలిపారు. ఈ వాదనలపై న్యాయమూర్తి స్పందిస్తూ.. అసలు ఎమ్మెల్యే లేఖ ఆధారంగా అధికారులు చర్యలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఆ లేఖతోపాటు గత నెల 1న ఆర్డీవోకు కలెక్టర్ రాసిన లేఖనూ సమర్పించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేశారు.